దశమహావిద్యలు అంటే ఏమిటి

దుర్గాసురసంహారం చేయు సందర్భంలో దుర్గాసుర సేనలను అంతమొందించుటకు దుర్గాదేవి తన శరీరంనుండి దశమహావిద్యాధిదేవతలను అవతరింపచేసి, దుర్గాసుర సేనలను అంతమొందించినది. అదేవిధంగా దక్షయజ్ఞమునకు వెళ్లు సమయాన దాక్షాయణీదేవిని పరమేశ్వరుడు నిరోధించగా తన తండ్రి ఇంట జరుగు యజ్ఞమునకు ఆహ్వాన పత్రిక పంపవలసిన పనిలేదు అని బలవంతాన యజ్ఞవాటికకు వెళ్లు సమయమున పరమేశ్వరుడు ఉగ్రరూపమును దాల్చి నిరోధించగా, దాక్షాయణీ భీకర కాళీరూపాన్ని దాల్చి, పరమేశ్వరుణ్ణి ఎదుర్కొనగా భద్రకాళీ ఉగ్రరూపాన్ని చూసి భయపడిన పరమేశ్వరుడు దశదిశలా పారిపోయే ప్రయత్నంచేసిన సందర్భంలో దశవిధ రూపాలతో అనగా కాళీ, తార, ఛిన్నమస్తా, బగళాముఖీ, ధూమావతీ, కమలాత్మిక, త్రిపురభైరవి, మాతంగి, భువనేశ్వరి, మహాషోడశి రూపాలతో నిరోధించినది. ఈ రెండు సందర్భములలో దశమహావిద్యలు ఆవిర్భావము జరిగినట్లుగా పురాణములనుబట్టి అవగతమగుచున్నది.

కాళీ : ఈ మహాశక్తి మహాకాళి, కాళి, దక్షిణకాళి, శరభకాళి, స్మశానకాళి, ఉగ్రకాళి, ఇత్యాదిరూపాలతో భక్తులను అనుగ్రహిస్తూ ఉన్నది. ఈ మహాశక్తి చూచుటకు ఉగ్రరూపంలో ఉన్నప్పటికీ తనను ఆశ్రయించిన భక్తులను అనుగ్రహించుటలో అతిశీఘ్రఫలప్రదాయిని. ఈ మహాశక్తిని ఉపాసించుటవలన శనిగ్రహదోషం అతిశీఘ్రముగా నివారించబడుతుంది. ఈ మహాశక్తి మనకు ఉన్న శత్రువులను మిత్రులుగా మారుస్తుంది. అగమ్యగోచరమైన జీవితానికి చక్కని మార్గదర్శకత్వాన్ని ప్రసాదిస్తుంది. భట్టివిక్రమార్కుని అంతటి పరాక్రమవంతులు కావడానికి కాళిదాసు మహాకవి కావడానికి, తెనాలి రామకృష్ణుడు వికటకవి కావడానికి, రామకృష్ణ పరమహంస పరమహంస కావడానికి, వివేకానందునికి అంతటి వాగ్ధాటి కలగడానికి, ఈ మహాకాళీ ఉపాసనే మూలకారణము.

తార : ఈ మహాశక్తి తార, ఉగ్రతార, స్వర్ణతార, నీల సరస్వతీ రూపాలలో భక్తులను అనుగ్రహిస్తూ ఉన్నది. ఈ మహాశక్తి చూచుటకు కాళికవలె దర్శనమిస్తుంది. ఈ మహాశక్తి నల్లని శరీరకాంతితో, త్రినేత్రాలతో, చతుర్భుజాలతో, నల్లకలువ, కత్తెర, ఖడ్గము, కపాలము, సర్పాభరణాలను ధరించి ఉంటుంది. ఈ మహాశక్తిని ఉపాసించు ఉపాసకులకు తారారూపంలో సర్వాభీష్టాలను ఉగ్రతారా రూపంలో శత్రుసంహారాన్ని, స్వర్ణతార రూపంలో అఖండైశ్వర్య భోగభాగ్యాలను, నీలసరస్వతీ రూపంలో విద్యాప్రాప్తిని అనుగ్రహిస్తుంది. ఈ మహాశక్తి గంభీర వాగ్జాలాన్ని ప్రసాదిస్తుంది. పరమేశ్వరుడు కూడా తారా ఉపాసకుడేనని తంత్రశాస్త్ర గ్రంథాలు తెలియజేస్తున్నాయి. ఈ మహాశక్తి బృహస్పతి దోషాన్ని అతిశీఘ్రంగా నివారిస్తుంది.

ఛిన్నమస్తా : దశమహావిద్యలలో అతి తీవ్రమైన దేవత ఛిన్నమస్తా. ఈ మహాశక్తి ఛిన్నమస్తా, వజ్రవైరోచనీ, ఛన్నకాళి రూపములతో పిలువబడుతూ భక్తులను అనుగ్రహిస్తూ ఉన్నది. ఈ మహాశక్తి చూచుటకు భయంకర ఉగ్రరూపములో ఉన్నప్పటికీ తనను ఆశ్రయించిన భక్తులయొక్క అంతశ్శత్రువులను అంతమొందించి, పరమపదమైన మోక్షసామ్రాజ్యాన్ని ప్రసాదిస్తుంది. ప్రతి జీవి ప్రాణము నవరంధ్రాలలో ఏదో ఒక రంధ్రంగుండా అవసానకాలంలో

బయటికి పోతుంది. కానీ ఈ మహాశక్తిని ఉపాసించు ఉపాసకులకు అంత్యమందు కపాలము బ్రద్ధలై, ప్రాణము మహాశక్తిలో ఐక్యమొందుతుంది. ఈవిధంగా కపాలమోక్షమై ప్రాణమును విడచిన జీవికి పునర్జన్మ ఉండదు. ఇటువంటి అద్భుతమైన మోక్షసామ్రాజ్యమును అనుగ్రహించే మహాశక్తియే ఛిన్నమస్తా. ఈ మహాశక్తి కేతుగ్రహ దోషాన్ని, కాలసర్పదోషాన్ని అతిశీఘ్రంగా నిరోధిస్తుంది.

బగళాముఖి : ఈ మహాశక్తి బగళా, బగళాముఖీ, పీతాంబరేశ్వరి అను పేర్లతో భక్తులను అనుగ్రహిస్తూ ఉంటుంది. ఈ మహాశక్తి స్తంభన దేవత, ఈ మహామంత్ర ఉపాసనా ప్రభావంవల్ల సభాస్తంభనము, శత్రుస్తంభనము, పంచభూత స్తంభనము, త్రిమూర్తి స్తంభనము కూడా ప్రాప్తిస్తుంది. ఈ ఉపాసన చేయు సాధకునికి బగలాంబికా, మృదుమధుర వాగ్జాలాన్ని అనుగ్రహిస్తుంది. అనేకమైన సిద్ధులను ప్రసాదిస్తుంది. ఈ మహాశక్తి కుజగ్రహదోషాన్ని నివారిస్తుంది.

ధూమావతి : ఈ మహాశక్తి ధూమ, ధూమావతి, ధూమ్రావతి, వృద్ధకాళీ అను పేర్లతో భక్తులను అనుగ్రహిస్తూ ఉంటుంది. ఈ మహాశక్తి విధవ. ఈవిధంగా కావడానికి ఒక పురాణగాథ ఉంది. ఒకానొక సందర్భంలో పార్వతీమాతకు విపరీతమైన ఆకలి వేసింది. తన ఆకలి తీర్చమని పరమేశ్వరుణ్ణి వేడుకుంది. ఆకలి తీర్చడం పరమేశ్వరుడికి చేతకాలేదు. ఆకలికి తాళలేని పార్వతి పరమేశ్వరుణ్ణే మ్రింగివేసింది. దానితో అమ్మవారు శరీరము నుండి భయంకరమైన పొగలుక్రక్కి అమ్మ వార్ధక్యాన్ని, వైధవ్యాన్ని, చిత్తచాంచల్యాన్ని పొంది విరబోసిన జుట్టుతో, భీకరమైన రూపముతో, చిరిగిన వస్త్రాలతో ఒకచేత చీపురు, ఒకచేత చాట, కాకధ్వజము కలిగిన రథాన్ని అధిరోహించి వికటాట్టహాసాలు చేస్తూ, ధూమావతిగా మారినది. ఈ మహాశక్తి మృత్యుంజయుడైన పరమేశ్వరుణ్ణే మింగివేసిన దేవత. ఈవిడ అష్టదారిద్ర్యాలను నివారించి అపమృత్యువును హరిస్తుంది. శత్రువులను అంతమొందిస్తుంది. అతిశీఘ్రగతిన భక్తులను అనుగ్రహించడంలో ఈమెకు ఈమెయే సాటి. ఈ మహాశక్తి రాహుగ్రహదోషాన్ని, కాలసర్పదోషాన్ని అతిశీఘ్రంగా పోగొడుతుంది.

కమలాత్మిక : ఈ మహాశక్తి కమల, కమలాత్మిక పేర్లతో భక్తులను అనుగ్రహిస్తుంటుంది. ఈ మహాశక్తి చూచుటకు లక్ష్మివలె పద్మాసనమందు, చతుర్భుజాలతో, వరదభయహస్తాలను, కమలములను ధరించి, నాలుగు ఏనుగులతో నిత్యమూ పూర్ణకలశములతో అభిషేకింపబడుతూ తనను ఆరాధించు భక్తులకు అష్టైశ్వర్య భోగభాగ్యములను అనుగ్రహిస్తూంటుంది. శుక్రగ్రహ దోషాన్ని అతిశీఘ్రముగా అంతమొందిస్తుంది.

త్రిపురభైరవి : ఈ మహాశక్తి భైరవి, త్రిపురభైరవి రూపములలో భక్తులను అనుగ్రహిస్తూ ఉంటుంది. ఈ మహాశక్తి భైరవునియొక్క అర్ధాంగి. ఈమె చూచుటకు బాలాత్రిపురసుందరివలె వరదాభయహస్తములను, జపమాల, పుస్తకములను ధరించి, కపాలమాలను ధరించి, కిరీటములో చంద్రవంకతో అలరారుతూ ఉంటుంది. స్త్రీ జన సంరక్షణ ఈమె బాధ్యత. దీర్ఘమైన వ్యాధులను అతిశీఘ్రముగా నివారిస్తుంది. ఈ మహాశక్తి సంపూర్ణ నవగ్రహ దోషములను అంతమొందిస్తుంది.

మాతంగి : ఈ మహాశక్తి మాతంగి, రాజమాతంగి, శుకశ్యామల, వేణుశ్యామల, వీణాశ్యామల, శ్యామల, ఉచ్ఛిష్ట చాండాలినీ మాతంగీశ్వరి పేర్లతో భక్తులను అనుగ్రహిస్తుంటుంది. ఈ మహాశక్తి లలితామహాత్రిపురసుందరి అమ్మవారియొక్క మంత్రిణి. రాజకీయముగా, విజయాన్ని సాధించాలనుకునేవారు, విద్యాప్రాప్తిని కోరువారు, సంగీత, సాహిత్య విద్యలను పొందాలనుకునేవారు, ఈ తల్లిని తప్పక ఆశ్రయించాల్సిందే. ఉచ్ఛిష్ట చాండాలినీ మాతంగీశ్వరి స్వరూపంతో తన ఉపాసకునియొక్క శత్రువులను, దుష్టప్రయోగ పీడలను అంతమొందించుటతో ఈమెకు ఈమెయే సాటి. ఈ మహాశక్తి సూర్యగ్రహదోషాన్ని అతిశీఘ్రముగా నివారిస్తుంది.

భువనేశ్వరి : ఈ మహాశక్తి త్రిభువనాధిపత్యాన్ని, భోగభాగ్యాలను, సంతుష్టిని ప్రసాదిస్తుంది. ఈ మహాశక్తి చంద్రగ్రహ దోషాన్ని అతిశీఘ్రముగా నివారిస్తుంది.

మహాషోడశి : ఈ మహాశక్తి బాలగా, లలితగా, రాజరాజేశ్వరిగా లోకాలను ఉద్ధరిస్తోంది. ఈ మహాశక్తిని ఆరాధించిన అతిశీఘ్రముగా వివాహము, సత్సంతానము ప్రసాదిస్తుంది. ఈ మహాశక్తి బుధగ్రహ దోషములను అతిశీఘ్రముగా నివారించి, అఖండైశ్వర్యాన్ని ప్రాప్తింపచేస్తుంది. సకలశుభాలను అనుగ్రహిస్తుంది.

బీజాక్షర ఉపాసన

బీజాక్షరము : 'సౌః' : అధిదేవత : మంగళగౌరి; వస్త్రము : పసుపు; పుష్పములు : పసుపు పచ్చని పుష్పాలు; ఆసనం : పసుపువర్ణంగల వస్త్రం; జప సంఖ్య : 1,08,000; జపమాల : పసుపు రుద్రాక్షమాల; నైవేద్యం : పులిహోర; లేపనం : శ్రీచందనం (గంధం); తిలకధారణ : భస్మగంధ, కుంకుమలు; హోమద్రవ్యములు : రావి సమిధలు, పసుపు, కుంకుమ; క్షేత్రము : గయ మంగళగౌరీ క్షేత్రము, శ్రీముక్కమల వింధ్యావాసినీ ఆలయము, మంగళగౌరీ దేవాలయములు; తర్పణం : తేనె కలిపిన ఆవుపాలు; మార్జనము : పసుపు నీళ్ళు; భోజనం : 9 మంది ముత్తైదువులు.

మంగళగౌరీ మంత్రాన్ని ఉపాసించే ఉపాసకులు సకల సౌభాగ్యములు పొందవలెనన్న, సౌభాగ్యబీజమైన "సౌః"కార బీజాక్షరాన్ని దీక్ష వహించి, పసుపు వస్త్రాలు ధరించి, పసుపు వర్ణంగల వస్త్రాన్ని ఆసనంగా వేసికొని 3 పూటలా మంగళగౌరిని పసుపుకుంకుమలతో అర్చిస్తూ, పులిహోరను నివేదిస్తూ, పసుపుపచ్చని రుద్రాక్షమాలను ధరించి, వేరొక మాలతో మంత్రాన్ని 1,08,000 సార్లు జపించి, రావి సమిధలుపయోగించి, పసుపుకుంకుమ పులిహోరలతో దశాంశహనం గావించి (10,800), తేనె కలిపిన ఆవుపాలతో 1080 సార్లు తర్పణం గావించి, పసుపు నీళ్ళతో 108 మార్జనంగావించి, పంచామృతాలతో 11 అభిషేకములు చేసి, 9మంది సువాసినులకు సంతర్పణగావించిన మంత్ర సిద్ధి చేకూరును. మంత్రసిద్ధిని పొందిన అనంతరం మన కోర్కెను మనసులో తలచి 10,800 సార్లు మంత్రము జపించిన అన్నీ కోర్కెలూ మంగళగౌరీ దివ్యానుగ్రహం వల్ల అతి శీఘ్రముగా నెరవేరును.